క్లుప్తంగా

శిక్షణ శిబిరం ప్రారంభం



స్టేషన్ మహబూబ్‌నగర్: స్థానిక బాల కేంద్రంలో సోమవారం విద్యార్థులకు శిక్షణ శిబిరం ప్రారంభమైంది. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ రాజేష్‌ఖన్నా మాట్లాడుతూ.. వేసవిలో విద్యార్థులకు సంప్రదాయ నృత్యం, గాత్ర సంగీతం, చిత్రలేఖనం, టైలరింగ్ అంశాల్లో శిక్షణ అందజేస్తున్నట్లు తెలిపారు. జూన్ 6వ తేదీ వరకు శిబిరం కొనసాగుతుందని.. ఆసక్తిగల విద్యార్థులు బాల కేంద్రంలో సంప్రదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వెంకటేశ్వరమ్మ, గజేంద్ర, దివ్య, సరోజ, హైందవి, సవిత పాల్గొన్నారు.

పిల్లల్లో దేశ, దైవభక్తి పెంపొందాలి



అడ్డాకుల: పిల్లల్లో దేశ, దైవభక్తి పెంపొందాల్సిన అవసరముందని వీహెచ్‌పీ విభాగ్ ప్రముఖ్ రాచాల జనార్దన్ అన్నారు. మూసాపేట మండలం వేములలో సోమవారం విశ్వహిందూ పరిషత్ పాలమూరు శాఖ ఆధ్వర్యంలో బాలబాలికలకు ఆధ్యాత్మిక వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులు నిర్వహించారు. వేముల సమీపంలోని ఆరు గ్రామాల నుంచి 150 మంది బాలబాలికలు రెండు రోజులపాటు జరిగే శిక్షణ తరగతులకు హాజరయ్యారు. వారికి సనాతన భారతీయ సంస్కృతి, సంప్రదాయానికి సంబంధించిన కుటుంబ విలువలపై ఆయన అవగాహన కల్పించారు. నిత్యం జీవితంలో ఆచరించే శ్లోకాలు, రామాయణ, భారత, భాగవత కథలతో పాటు పెద్దలు, తల్లిదండ్రులను గౌరవించే విధానంపై చైతన్యం నింపారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి నాగరాజు, ప్రభాకర్‌జీ, లక్ష్మీఫణపాటి, డా.సరిత సీజీ మధు, కొండారెడ్డి పాల్గొన్నారు.

క్షయపై అవగాహన



మిడ్జిల్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షయ నియంత్రణ అధికారి డా.మల్లికార్జున్ మాట్లాడుతూ.. క్షయ వ్యాధిని ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి అవసరమైన చికిత్స పొందాలని సూచించారు. 19 ఏళ్లలోపు బాలబాలికలు క్షయ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని కోరారు. మండల వైద్యాధికారి శివకాంత్, సీహెచ్‌ఓ అబీబ్‌ఖాన్, ప్రసాద్, దేవయ్య, సంపత్, జంగయ్య పాల్గొన్నారు.

ఇసుక అనుమతులు రద్దు చేయాలని ధర్నా



మిడ్జిల్: మండలంలోని కొత్తపల్లి శివారు నుంచి ఇసుక తరలింపునకు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇసుక రవాణాతో భూగర్భజలాలు పడిపోతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. రైతులను దృష్టిలో ఉంచుకొని ఇసుక అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాన్ని ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, నాయకులు జనార్దన్‌రెడ్డి, తిరుపతి, వెంకటయ్య, బుచ్చయ్య, జంగిలయ్య, ఈశ్వర్, భీరయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



దేవరకద్ర: హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద వచ్చే నెల 7వ తేదీన నిర్వహించనున్న హైందవ భక్తి సమ్మేళనానికి సంబంధించిన పోస్టర్లను సోమవారం మండల కేంద్రంలోని వీరప్పయ్య స్వామి ఆలయంలో ఆవిష్కరించారు. ముందుగా కౌకుంట్ల భజన బృందం వారు రెండు గంటలపాటు భజనలు చేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌గౌడ్, ఆంజనేయులు, శేఖర్, శ్రీనివాసగౌడ్, రాములు, భగవంతురెడ్డి, సరోజనమ్మ, సీతమ్మ, సునీత, శ్రీకాంత్, నర్సింహులు, అర్చకులు నాగభూషణం, నాగరాజు పాల్గొన్నారు.

ఉపాధికి ఊతం



గాధిర్యాల్ అటవీ ప్రాంతంలో పాంపాండ్స్ నిర్మిస్తున్న కూలీలు (ఫైల్)

- ఎన్‌ఆర్‌ఈజీఎస్‌తో వలసలకు అడ్డుకట్ట
- ఉమ్మడి గండేడ్ మండలంలో రూ. 2కోట్లతో పనులు
- నిత్యం 2,500 నుంచి 3వేల మంది వరకు కూలీ పనులు



ఆముదాలగడ్డ తండాలో వాలుకట్టలు తవ్వుతున్న కూలీలు (ఫైల్)

మహమ్మదాబాద్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో కూలీలకు స్వగ్రామాల్లోనే ఉపాధి లభిస్తోంది. గతంలో వేసవికాలం వచ్చిందంటే చాలు.. గ్రామీణ ప్రాంత కూలీలు, వ్యవసాయదారులు పట్టణాలకు వలస వెళ్లి కూలీ పనులు వెతుక్కునే దుస్థితి ఉండేది. ఉపాధి హామీ పథకంతో ఎంతో మంది కూలీలకు మేలు చేకూరుతోంది. వేలాది మంది కూలీలు స్వగ్రామాల్లోనే ఉంటూ రోజుకు రూ.309 కూలికి ఉపాధి హామీ పనులు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ఉమ్మడి గండేడ్ మండలంలో 2025–26 సంవత్సరం దాదాపు రూ. 2కోట్ల నిధులతో కూలీలకు పనులు కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఉమ్మడి మండలవ్యాప్తంగా 13వేల జాబ్‌కార్డులు ఉండగా.. 9,200 మంది కూలీలు పనిచేస్తున్నారు. వారందరికీ దాదాపు 3లక్షల పనిదినాలు కల్పిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. గత మార్చి నుంచి కూలీలకు 100 రోజుల కొత్త పనిదినాలు రావడంతో ప్రతి గ్రామంలో వందల సంఖ్యలో ఉపాధి హామీ పనుల్లో నిమగ్నమయ్యారు.

అందరికీ ఉపయోగపడేలా..

ఉపాధి హామీ పథకం ద్వారా ఓవైపు గ్రామాల్లోని కూలీల వలసలను నిరోధించడంతో పాటు మరోవైపు అందరికీ ఉపయోగపడే పనులు చేపడుతున్నారు. అందులో వ్యవసాయ పొలాలను చదును చేయడం.. పాంపాండ్ (నీటి కుంటలు), వ్యవసాయ పొలాలకు మట్టిరోడ్ల నిర్మాణాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. అదే విధంగా అటవీ ప్రాంతంలో నీటిని నిలిపేందుకు వాలుకట్టలు, ఊటకుంటలు, పాంపాండ్స్ తదితర పనులు చేపడుతున్నారు. ఇలాంటి పనులతో భూగర్భజలాలు పెరిగి రైతులకు ఎంతో మేలు చేకూరే అవకాశం ఉంటుంది. అదే విధంగా వన్యప్రాణులకు తాగునీరు కూడా లభించే అవకాశం ఉంది.

మాలాంటి వారికి మేలు..



వ్యవసాయ పనులు లేని సమయంలో కూలీకి వెళ్లాలంటే పట్టణాలు లేదా బయటి ప్రాంతాలకు వెళ్లాల్సిందే. అలాంటి సమయంలో ఉపాధి హామీ పథకం ద్వారా మూడు నెలల పాటు ఎక్కడికీ వెళ్లకుండా పని కల్పించడం వల్ల మాలాంటి వారికి ఎంతో మేలు జరుగుతుంది. మార్చి నుంచి కొత్త పనిదినాలు రావడం, కూలి రేటు పెరగడం సంతోషంగా ఉంది.

– సంగ్రాసి అంజిలయ్య, గాధిర్యాల్, మహమ్మదాబాద్ మండలం

కూలి డబ్బులు త్వరగా ఇవ్వాలి..



స్వగ్రామంలోనే పని కల్పించడం ఎంతో సంతోషంగా ఉంది. అలాగే చేసిన పనులకు ఎప్పటికప్పుడు కూలి డబ్బులు ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. కూలీలకు పని ప్రదేశంలో అన్ని సౌకర్యాలు కల్పించాలి. బీమా సౌకర్యం కూడా కల్పించాలి.

– తిమ్మాయిపల్లి భీమమ్మ, రుసుంపల్లి, గండేడ్ మండలం

ప్రభుత్వ ఆదేశాల మేరకు..



ఉపాధి హామీ పథకంలో 2025 – 26 సంవత్సరానికి గాను మార్చి నుంచే కొత్త పనులు ప్రారంభించడం జరిగింది. కూలి రేటు కూడా రూ.9 పెంచారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అంతర్గత భూగర్భజలాలు పెంపొందించే పనులు కూలీలతో చేయిస్తున్నాం. చెరువుల పూడికతీత, ఒండ్రుమట్టి తరలించే పనులు మాత్రం పెట్టలేదు. కూలీలకు ఎప్పటికప్పుడు కూలి డబ్బులు అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

– హరిశ్చంద్రుడు, ఏపీఓ, ఉమ్మడి గండేడ్ మండలం

తాగునీటి సమస్య లేకుండా చూడాలి



నవాబుపేట: గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఎంపీడీఓ జయరాం నాయక్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. ఇందుకు గత నెలలోనే ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. తాగునీటి సరఫరాపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని.. ఎక్కడైనా సమస్య ఏర్పడితే వెంటనే స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు. అదే విధంగా ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని సూచించారు. సమావేశంలో ఈఓపీఆర్డీ భద్రునాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి సమీయుల్లా, ఏపీఓ జ్యోతి తదితరులు ఉన్నారు.

గోశాలకు గోవుల తరలింపు



చిన్నచింతకుంట: మండలంలోని అమ్మాపురంలో వెలసిన కురుమూర్తి స్వామికి భక్తులు మొక్కుబడులుగా సమర్పించిన 8 గోవులను సోమవారం ఆలయ సిబ్బంది హన్వాడ మండలం చిన్నదర్పల్లిలోని శ్రీలక్ష్మి గోశాలకు తరలించారు. ఈ సందర్భంగా కురుమూర్తి స్వామి ఆలయ గోశాల కాపరి నాగరాజు మాట్లాడుతూ.. గోవుల సంరక్షణ కోసం చిన్నదర్పల్లి గోశాలకు తరలించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుడు భాస్కరాచారి, అర్చకుడు కృష్ణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్ద నాలా పరిశీలన



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని శివశక్తినగర్ నుంచి పాత పాలమూరు కొత్త బ్రిడ్జి వరకు ఉన్న పెద్ద నాలాను సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. వాస్తవానికి వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల్లోని నివాసగృహాలు ముంపునకు గురికాకుండా ఉండేందుకు పెద్దచెరువు పక్క నుంచి వరద కాల్వ నిర్మిస్తున్నారు. కాగా, ఈ ప్రాంతంలో వరద కాల్వకు ఇరువైపులా సుమారు పది ప్లాట్లు ఉన్నాయి. బఫర్ జోన్ కావడంతో వీటికి తప్పనిసరిగా సెట్‌బ్యాక్ ఎక్కువగా తీసుకోవాల్సి ఉంటుందని.. సదరు యజమానులు మంగళవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి రావాలని ఆయన సూచించారు.

‘ఉగ్రదాడులను ముక్తకంఠంతో ఖండిద్దాం’



కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేస్తున్న సీపీఎం నాయకులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఉగ్రవాదుల దాడులను ముక్తకంఠంతో అందరూ ఖండించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కిల్లె గోపాల్ అన్నారు. పహల్గాం ఘటనను నిరసిస్తూ సోమవారం జిల్లా పార్టీ కార్యాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాధిత కుటుంబాలకు రూ. 10లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. దేశంలో మత విద్వేషాలను సృష్టించే శక్తులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బొల్లె చంద్రకాంత్, జి.రాజ్‌కుమార్, ప్రశాంత్, వరదగాలన్న, ఎర్ర వెంకటన్న, పదాల వెంకటయ్య, ఖమర్‌అలీ, పదాల లక్ష్మయ్య, ఈశ్వర్, సురేష్, నర్సింహులు పాల్గొన్నారు.

■ దేశంలో ఉగ్రవాదాన్ని అంతమొందించాలని జ్ఞానసీలి బహుజన మహనీయుల శోభాయాత్ర ఉమ్మడి జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు పాతూరి రమేష్ అన్నారు. పహల్గాం ఘటనను నిరసిస్తూ స్థానిక పాతపాలమూరులోని జైభీమ్ చౌరస్తాలో కొవ్వొత్తులతో అమరులకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు సింగిరెడ్డి పరమేశ్వర్, రాయికంటి రాందాస్, రాజు, డి.బాలన్న, ఉస్కిల్ల వెంకట్రాములు, ఎర్ర నర్సింహ, పడకంటి యాదగిరి, గుగ్గిళ్ల కృష్ణయ్య, పట్నం చెన్నయ్య, పురుషోత్తం పాల్గొన్నారు.



జైభీమ్ చౌరస్తాలో..

మే డేను దీక్షా దినంగా జరుపుకోవాలి

జడ్చర్ల టౌన్: వచ్చే నెల 1వ తేదీన అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని కార్మిక వర్గం, రైతులు, వ్యవసాయ కార్మికులు దీక్షా దినంగా జరుపుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకుడు రాములు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన మే డే సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను హరిస్తూ.. నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందన్నారు. వాటి ఫలితంగా 8గంటల పనిదినాన్ని 12 గంటలకు మార్చడంతో పాటు కనీస వేతనాలు లేకుండా చేశారన్నారు. మే డే స్ఫూర్తితో కార్మిక వర్గం ఐక్యంగా పోరాడి హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడుతూ.. మే 1న కార్మిక వర్గం అంతా ఐక్యంగా కదిలి దీక్షా దినంగా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దీప్లానాయక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నర్సింహులు, రైతు సంఘం నాయకులు మధు, సాయిలు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



మే డే పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎట్టకేలకు మహ్మదుస్సేన్‌పల్లి – నిజాలాపూర్ రోడ్డు పనులు

అడ్డాకుల: మూసాపేట మండలంలోని మహ్మదుస్సేన్‌పల్లి నుంచి నిజాలాపూర్ వరకు బీటీరోడ్డు పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో మహ్మదుస్సేన్‌పల్లి నుంచి నిజాలాపూర్ వరకు సుమారు 3 కి.మీ. దూరం బీటీరోడ్డు వేయడానికి సీఆర్‌ఆర్ నుంచి రూ. 3.30 కోట్లు మంజూరయ్యాయి. 2023 అక్టోబర్ 6న అప్పటి మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఆ వెంటనే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో రోడ్డు పనులు ప్రారంభం కాలేదు. బీటీరోడ్డు నిర్మాణంపై పలుమార్లు వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి దృష్టికి ఇరు గ్రామాల ప్రజలు తీసుకెళ్లారు. రోడ్డు పనులను సాధ్యమైనంత త్వరగా చేపట్టాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు సూచించారు. ఈ మేరకు బీటీరోడ్డు నిర్మించేందుకు సంబంధిత గుత్తేదారు ముందుకువచ్చారు. సోమవారం స్థానిక కాంగ్రెస్ నాయకులు రోడ్డు పనులను ప్రారంభించారు. రోడ్డు పనుల ప్రారంభానికి కృషిచేసిన ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డికి ఇరు గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సీజీ.గోవర్ధన్, రాంచందర్, దేవన్న యాదవ్, యాదగిరి, సతీశ్ కుమార్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, గంగపూరి, జైపాల్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, బాలయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.



బీటీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

గ్రామీణ క్రీడాకారులకు మంచి రోజులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: గ్రామీణ క్రీడాకారులకు మంచి రోజులు వచ్చాయని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వచ్చే నెల 16 నుంచి 18వ తేదీ వరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో జాంద్ర ప్రీమియర్ లీగ్ క్రికెట్ (జేపీఎల్) సీజన్-3, జాంద్ర కమ్యూనిటీ హాల్‌లో చెస్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నారు. వీటికి సంబంధించిన వాల్ పోస్టర్లను సోమవారం తన క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని క్రికెట్, చెస్ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు కొల్లె చెన్నవీరయ్య, ఎ.అంజయ్య, నిర్వాహకులు సడ్డె పవన్‌కుమార్, పి.అనిల్‌కుమార్, మద్దూరి రాఘవేందర్, సడ్డె శివ పాల్గొన్నారు.



క్రీడల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త : డీఎస్పీ

మహబూబ్‌నగర్ క్రైం: సైబర్ నేరాలకు ఎవరూ బలి కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం సురక్ష పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో స్థానిక న్యూమోతినగర్‌లో సామాజిక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరరహిత సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలన్నారు. అలాగే మత్తు పదార్థాల వాడకం, జూదం, బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. కాగా, సామాజిక రుగ్మతలు, దురాచారాల నివారణకు తీసుకోవాల్సిన అంశాలపై కళాబృందం సభ్యులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్, ఎస్‌ఐ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

నేడు నవాబుపేటలో భూ భారతిపై అవగాహన

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): నవాబుపేట మండల కేంద్రంలో మంగళవారం భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కలెక్టర్ విజయేందిర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే సదస్సుకు జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. మండలంలోని రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

బాధ్యులపై చర్య తీసుకోవాలి

జడ్చర్ల టౌన్: మండలంలోని పోలేపల్లిలో భూమి హక్కుదారులకు తెలియకుండా ఇతర వ్యక్తుల పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు నకిలీ పత్రాలు సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్‌కు ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి వినోద్ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలేపల్లి శివారులోని 486, 487, 488, 489 సర్వే నంబర్లలో ఉన్న భూమిలో చేపట్టిన పనులను వెంటనే నిలిపివేయాలని కోరారు. ఈ మేరకు జడ్చర్ల తహసీల్దార్ నర్సింగ్‌రావును కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కందూరి యాదయ్య, ఉషాని మహేశ్ పాల్గొన్నారు.

కార్మికుల శ్రమదోపిడీ ఆపాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: కార్మికుల శ్రమను దోపిడీ చేస్తూ పెట్టుబడిదారులు ఆర్థికంగా బలపడ్డారని.. ప్రభుత్వాలు కార్మిక వర్గాలను నిర్లక్ష్యం చేస్తున్నాయని టీయూసీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.వెంకటేశ్ ఆరోపించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో మే డే పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వాలపై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. మే డే వేడుకల్లో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైస్‌మిల్లు అసోసియేషన్ అధ్యక్షుడు పీడాస్, కార్యదర్శి శేఖర్, నాయకులు కృష్ణ, ఆంజనేయులు శ్రీను పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

దేవరకద్ర: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు అన్నారు. దేవరకద్ర మండలం గుడిబండలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారు వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించాలని సూచించారు.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక



జడ్చర్ల టౌన్: ఇందిరమ్మ ఇళ్ల పథకానికి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా చేపడుతున్నట్లు ఎంపీడీఓ విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని ఆలూరులో ఆయన పర్యటించి.. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి విచారణ చేపట్టారు. అన్ని అర్హతలతో పాటు సొంత ఉండి, ఇల్లు కట్టుకోడానికి సిద్ధంగా ఉన్న లబ్ధిదారులను గుర్తించాలని పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్‌కు సూచించారు. లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి అవకతవకలకు పాల్పడరాదని సూచించారు. అనంతరం ఎంపీడీఓ దరఖాస్తు దారులను నేరుగా కలిసి వివరాలు సేకరించారు. గ్రామంలో తాగునీటి పరిస్థితులపై ఆరా తీశారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు, కూలీల గురించి విచారించారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. మధ్యాహ్నం వేళ అవసరమైతేనే బయటకు రావాలని సూచించారు.

అన్నివర్గాల సంక్షేమానికి కృషి



స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని పార్టీ సీనియర్ నాయకుడు ఎన్పీ వెంకటేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని 30వ వార్డు వీరన్నపేటలో సోమవారం జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ హయాంలో చేపట్టిన అభివృద్ధిని వివరించారు. అనంతరం వెంకటేశ్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని అవమానపరుస్తూ.. అప్రజాస్వామిక నిర్ణయాలు తీసుకుంటుందని ధ్వజమెత్తారు. బీజేపీ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో జేబీఎం జిల్లా చైర్మన్ ఎస్.సుదర్శన్, నాయకులు శేఖర్, నరేందర్, మహేశ్, శంకర్, రాజు, సోను, అజయ్ పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రాజ్యాంగ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని మున్సిపల్ మాజీ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. సోమవారం స్థానిక 21వ డివిజన్ పరిధిలో ‘జై బాపు, జై భీమ్, జై సంవిధాన్’ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాంనరేష్, గుంటూరు రాజు, జీవన్, పుల్జానాయక్, రాజు, వెంకటయ్య పాల్గొన్నారు.

ప్రాంగణం సరే.. వసతులేవి?



ఇది మూసాపేట మండలం తుంకినీపూర్ గ్రామంలో గత ప్రభుత్వం ఏర్పాటుచేసిన తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణం. ఇక్కడ పెద్ద బోర్డును ఏర్పాటు చేశారు. క్రీడలు ఆడేందుకు కనీసం గ్రౌండ్‌ను కూడా చదును చేయలేదు. ఇందులోనే దేవాలయం, పక్కన వాటర్ ట్యాంక్ ఉంది. క్రీడలు ఆడేందుకు స్థలం కూడా అంతంత మాత్రమే. రూ.లక్షలు వెచ్చించి క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసినా.. ఆటలు ఆడేందుకు కనీస వసతులు లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఇక్కడ వ్యాయామం చేయడానికి మాత్రం కొన్ని పరికరాలు ఉన్నప్పటికీ వాటి చుట్టూ ముళ్ల పొదళ్లు అల్లుకున్నాయి. ఈ ఒక్క గ్రామంలోనే కాకుండా చాలా గ్రామాల్లో తెలంగాణ క్రీడా ప్రాంగణాల పరిస్థితి ఇదే విధంగా ఉంది.

– అడ్డాకుల